IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# దిలావర్ గిరిజన కథలు: వస్తు విశ్లేషణ

**అలోతు తిరుపతి**

**పరిశోధన విద్యార్థి**

**తెలుగు శాఖ**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయం**

ప్రపంచీకరణ పేరుతో, దోపిడీ, పీడన, అణచివేత కేంద్రీకృతంగా దాడి చేస్తున్న సందర్భంలో దానికి వ్యతిరేకంగా వెల్లువైన ప్రతిఘటనను ప్రతిబింబించే సాహిత్యాన్ని ప్రపంచీకరించాల్సిన అవసరం నేడు ఎంతో ఉంది. ప్రతిఘటన సాహిత్యం ప్రపంచీకరించబడితేనే ఒక బలమైన ప్రభావాన్ని కలిగిస్తుందన్న సాహితీవేత్తలలో దిలావర్ ఒకరు. దక్షిణ భారతదేశంలో సుమారు పదిశాతం గిరిజన జనాభాతో గిరిజనులు అధికంగా ఉన్న జిల్లాగా పేరొందిన ప్రాంతంలోని కవులకు, రచయితలకు మాత్రం గిరిజన జీవన చిత్రణ మీద స్పృహ చాలా తక్కువ అనే చెప్పాలి. ఇందుకు కవులు, రచయితలకు అడవుల్లో జీవించే గిరిజనులు దూరంగా ఉండడం కారణంగా చెప్పవచ్చు. అంటే అడవులకు, గిరిజనులు దగ్గరగా ఉండే కవులు, రచయితలకు గిరిజన జీవితాలను, సమస్యలను అర్థం చేసుకునే అవకాశం దొరుకుతుంది. అలాంటి అరుదైన అవకాశం దిలావర్ కి దక్కింది. గిరిజన ప్రాంతంలో చిన్న పాఠశాల ఉపాధ్యాయునిగా ప్రారంభమైన దిలావర్ సాహితీ ప్రస్థానం అంచేలంచలుగా ఎదిగి సాహితీకారునిగా, ఉన్నత విద్యావంతునిగా, డాక్టరేట్ సంపాదించి కళాశాల ప్రిన్సిపాల్ స్థాయికి ఎదిగేలా చేసింది. ప్రపంచం మొత్తం మీద ఏ ప్రాంతమైనా, ఏ భాషైనా సామాన్యుడి జీవితం, అతని సమస్యలు, దిగుళ్ళు, అతని కన్నీళ్ళ, భాష వాటి రంగు, రుచి, దుఃఖం, ఎగదన్నిన గుండెచప్పుడూ అతనిలోని ప్రేమ, ద్వేషం, భావోద్వేగాలు, వేదనలు, సంవేదనలు, అనుభవాలు, ఆలోచనలు, అనుభూతులు, ఒక్కటేనని నమ్మేకవి దిలావర్.

దిలావర్ ముస్లిం కవి. స్వయంకృషితో ఎదిగిన రచయిత. ఆయన ఎల్లప్పుడూ సృజనాత్మక సాహిత్యం రాయడానికే ఇష్టపడతారు. గడిచిన జ్ఞాపకాలజోలికి వెళ్ళకుండా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

కథనూ, కవిత్వాన్ని రెండు చేతులా నడిపిస్తున్న ఖమ్మం జిల్లా రచయితలలో దిలావర్ ది ప్రత్యేక స్థానం. ఆయన కవిత్వంలోనూ, కథలల్లోనూ వ్యదార్త జీవన యధార్థ దృశ్యాలే కనిపిస్తాయి. లోకాన్ని, జీవితాన్ని ఆకాళింపు చేసుకున్న ఒక పెద్దాయన తన పిల్లల్ని, కూర్చొపెట్టుకొని తన అనుభవసారాన్ని రంగరించినట్లుగా దిలావర్ కథలుంటాయి. జన్మతః ముస్లిం అయినా దిలావర్ భాష, భావంలో ఆ ఛాయలు అణుమాత్రమయిన కనిపించవు. ప్రత్యేక సందర్భాలలో తప్పిస్తే, అతను ముస్లిం అని గుర్తించడం కష్టం.

గిరిజన, సంచారజాతి తెగల జీవితం, ఆదివాసీల జీవితం అందులోని ఆటుపోట్లను తమ తమ అవగాహన మేరకు నిజాయితీగ చిత్రించడానికి వివిధ కాలాల్లో తెలుగు కథకులు కృషిచేశారు. ఎవరి పరిమితులు వారికి ఉండనే ఉన్నాయి. 1930లలో ఈ కృషి ప్రారంభమైన 1970ల వరకు వేళ్ళమీద లెక్కించగలిగే కథలే వచ్చాయి. 1970లో వచ్చిన శ్రీకాకుళ, 1980లలో వచ్చిన ఉత్తర తెలంగాణ గిరిజన ఉద్యమాల నేపథ్యంలో గిరిజనులే కేంద్రంగా అనేక కథలొచ్చాయి.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలోగల గిరిజన తెగలకు సంబంధించిన చాలా కథలు వచ్చాయి. కానీ ఇప్పటికీ మౌఖికంగానే, జానపద కథల రూపంగానే ఉన్నాయి. ఎంతోమంది రచయితలు, గిరిజన ఆదివాసీలపై పరిశోధనలు చేసినప్పటికీ, కథలు రాసినప్పటికీ అవి పూర్తిగా వెలుగులోకి రాలేకపోయాయి. ఆదివాసీల ఆచార సంప్రదాయాలు సంస్కృతీ వేష భాషలు, గిరిజన నృత్యాలు మొదలైన వాటి గురించి ఎంతోమంది రచయితలు, సాహిత్యాకారులు రాశారు. కానీ అవి వారి బాహ్య జీవితాన్నే తెలియజేశాయి.

అడవి బిడ్డల జీవితాలలోని ఇబ్బందులను స్వచ్ఛమైనవారి హృదయాలను, అమాయకపు జీవితాలలోని ఆర్ద్రతను బయటకు తెలియచేయడం దిలావర్ కి సాధ్యమయింది. కొండా..కోనల్లో కథాసంపుటిలో ఆదివాసీల కథలను రాశారు. దాదాపు పాతిక సంవత్సరాలు ఆదివాసీల జీవితాలను

దగ్గరగా చూసారు. రచయిత ఉద్యోగం మొదలైంది గిరిజన ప్రాంతంలోనే చివరకు స్థిరపడింది. గిరిజన ప్రాంతంలోనే.

దిలావర్ ఉద్యోగ జీవితం 'మేకలతండ' అనే గిరిజన తండాలో ప్రారంభమైంది. ఆ తర్వాత 'ధనియాలపాడు', 'ముత్యాలంపాడు', 'కోయగూడెం' మొదలైన ప్రాంతాలలో ఉద్యోగం చేశారు. పదవి విరమణ పొందిన తర్వాత ఆయన గిరిజన ప్రాంతమైన పాల్వంచలోనే స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు.

ఆదివాసీల మధ్య తిరిగిన అనుభవంచేతనే ఇలాంటి కథలు రాశారు. వారి జీవన్మరణ సమస్యలను చూస్తూ రాయకూండా ఉండలేనితనం ఈ కథలు రాయడానికి కారణం అయింది అని చెప్పడంలో ఆయనలోని సున్నితత్వం, హృదయపు తడి మనకు తెలుస్తుంది.

కొండా...కోనల్లో ఆదివాసీ కథలు దిలావర్ రెండవ కథాసంపుటి. ఈ సంపుటిలో పన్నెండు కథలు ఉన్నాయి 1. కారడవిలో కాంతి కిరణం 2. పాటకు మరణం లేదు 3. వేట 4. తునికాకు 5. బొందలగడ్డ 6. రాళ్ళూరప్పలూ 7. 1/70x420 8. చెట్లు కూలుతున్న దృశ్యం 9. నిర్జీవావరణం 10. అరణ్య రోదన 11. కొండ కోనల్లో 12. ఆ ఏడు మండలాలు.

"నిర్జీవావరణం" అనే కథలో అడవిలో జీవించే గూడెం వాసులు అడవి జంతువులతో ఎలా మమేకం అవుతారో, అలాగే అడవి జంతువుల నుండి వారికున్న ప్రమాదాలను చిత్రించారు.

ఈ కథలో రచయిత తను చిన్నప్పుడు చదువుకున్న సైన్స్ పాఠాలను జోడించారు. అడవులు ఆక్సిజన్, కిరణజన్య సంయోగక్రియ, మొక్కలు వాటి ఆహారం మొదలైన అంశాలు గుర్తు చేసుకుంటాడు రచయిత. అడవి మనకు అన్నీ ఇస్తుంటే మనిషి తిన్నింటి వాసాలు లెక్కపెడుతున్నారు. మనిషి ఆరోగ్యంగా జీవించడానికి ప్రకృతి అన్ని సదుపాయాలూ కలిగిస్తున్నది. మనిషి రోదసిలోకి ఎగబాకుతుంటే మూర్ఖత్వం పాతాళంలోకి కూరుకుపోతుంది. తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతిని పణంగా పెడుతున్నారు. అడవులను నరికి నిర్దాక్షిణ్యంగా ఎడారులుగా మారుస్తున్నారు. జీవావరణాన్ని అత్యంతక్రూరంగా నిర్జీవావరణంగా మారుస్తున్నారని రచయిత ఆవేదన చెందారు.

"అరణ్య రోదన" కథలో కొంతమంది సాహిత్యకారులు, పోలవరం ముంపు ప్రాంతాల్లోని నిజానిజాలను తెలుసుకునేందుకు అక్కడి కోయజాతులను, అక్కడి పరిస్థితులను అధ్యయనం

చేసేందుకు వెళ్తారు. కుక్కునూరు, వేలేరుపాడు. కూనవరం, రామచంద్రాపురం, చింతూరు మండలాల్లోని దాదాపు ఇరవై గ్రామాలను పర్యటిస్తారు. అదంతా అటవీ ప్రాంతం.

పోలవరం ప్రాజెక్టువలన లక్షలాది గిరిజనులు నిర్వాసితులు కావడమే కాకుండా, కొండలూ, కోనలూ, లోయలూ, రమణీయమైన పాపికొండలు, కనువిందు చేసే ప్రకృతి, ఆదివాసీల చరిత్ర, సంస్కృతి జలసమాధి అవుతున్నాయి. అటవీప్రాంతం నుండి గిరిజనులను మైదాన ప్రాంతాలకు తరలిస్తే, వాళ్ళ బతుకులు ఎలాంటి అవాంఛనీయ అసాంఘిక విషవలయాల్లో పడతాయో ఈ కథలో వివరించారు రచయిత.

"కొండా...కోనల్లో" కథలో అటవీ ప్రాంతానికి విహారయాత్ర చేయాడానికి వెళ్ళిన వారి అనుభవాలను కథగా మలిచాడు రచయిత.

ఈ కథాసంపుటికి ఈ కథ పేరుపెట్టారు రచయిత. ఇందులో గిరిజన వీరులు, వీర వనితలు, గిరిజన చారిత్రక సాంస్కృతిక ప్రదేశాల గురించి తేజ, ఉషతో చెప్పినట్టుగా వివరించారు కథకుడు. ఉష, తేజను గిరిజనుల విశేషాలను చెప్పమంటుంది. తేజకు తను *ఆంధ్రప్రదేశ్ ఆదివాసీలు* అనే అంశం మీద పిహెచ్. డి., చేసిన రోజుల గురించి వివరించారు.

పోలవరం ప్రాజెక్టు వలన భవిష్యత్ తరాలు ఎదుర్కోబోయే పరిణామాలను ఈ కథలో వివరించాడు రచయిత.

ఈ కథలో గిరిజన తిరుగుబాట్లను వివరించాడు. గిరిజన ఉద్యమాలు ఖచ్చితమైన ప్రణాళికలతో గిరిజన జీవితంలో ఏర్పడిన వ్యత్యాసాలకు అనుగుణంగా వచ్చినట్టు వంటివి. గిరిజన సమాజంలో ఏర్పిడిన ఈ వ్యత్యాసం చారిత్రకంగా చోటుచేసుకున్న వలసవాదుల పాలన ఫలితంగా గిరిజనుల బతుకులు ఛిద్రమయ్యాయి. ఆధునిక సమాజంలో బ్రిటీషు పాలకులు భారతదేశాన్ని పాలించేటప్పుడు ఒక ఆధునిక విధానాన్ని అవలంబించారు. వలస పాలకులు ప్రవేశపెట్టిన సర్వే అండ్ సెటిల్ మెంట్ విధానం వల్ల గిరిజనులు భూమిపై యాజమాన్యం హక్కును కోల్పోయారు. గిరిజనులు కొట్టుకున్న పోడు వ్యవసాయంపై నిషేధం విధించి భూస్వాములు, జమీందారులు, వ్యవస్థకు గిరిజన భూములను అక్రమంగా లాగేసుకున్నారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని దళారులు గిరిజనేతరులు మోసాలకు పాల్పడడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుండి

గిరిజనుల అభివృద్ధి కోసం అనేక పథకాలు ఏర్పాటు చేసిన ఆ పథకాలు గిరిజన గూడెంలకు, తండాలకు సక్రమంగా అమలుకాకపోవడానికి కారణం పాలకులు, అధికారుల నిర్లక్ష్యం. కావున గిరిజనులకు రాజ్యాంగంలో అనేక చట్టాలు ఉన్న అవి చట్టాలుగా మారి కాగితాలకే పరిమితమవుతున్నాయి. కావున తమ హక్కులను ఇలా కాలరాయడం వల్ల గిరిజనుల పాలకులు మారినా, అధికారులు మారినా తలరాతలు మారలేదు. అందుకోసం తమ మనుగడ. ఆత్మగౌరవ హక్కుల సాధన కోసం గొంతెత్తి తిరుగుబాటు, ఆందోళన చేయడం తప్పులేదని చెప్పవచ్చు.

ప్రపంచంలో ఏ ప్రాంతంలో ఉద్భవించిన కథైనా, ఆ ప్రాంత మట్టివాసనలు, కష్టాలు, కన్నీళ్ళు, ఆనంద విషాదాలు, బాధలు, సంతోషాలు, వేదన, ఆవేదనలు, ఆవేశాలు, ఆక్రందనలు, పీడత, పేదప్రజల మనస్తత్వాలను ఆ ప్రాంతంలో ఉన్న ప్రత్యేకతలన్నింటినీ కలుపుకొని రూపొందుతాయి. కథ సమాజాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. వారు జీవించే గూడెం, తండా, కోన, జీవనాధారమైన అడవి తప్ప మరోలోకం తెలియని ఆదివాసీల జీవితాల్లోకి, వారు సాగు చేసుకునే పోడు వ్యవసాయంలోకి పట్టణాల నుండి మైదాన ప్రాంతాల నుండి వచ్చిన పెత్తందార్లు, షావుకార్లు గిరిజనులను దోచుకొని వారు పోడు చేసుకుంటున్న వ్యవసాయాన్ని ఆక్రమించుకున్న సన్నివేశాలను ఎంతో ఆర్థ్రంగా చిత్రించినవారు ఎందరో ఉన్నారు. ఆదివాసీల జీవన విధానాన్ని, సంస్కృతి సంప్రదాయాలను, ఆచారవ్యవహారాలను, ఉద్యమవీరుల జీవితాన్ని చక్కగా వివరించారు దిలావర్.

కొండా...కోనల్లో కథాసంపుటిలోని అన్ని కథలు గిరిజన, పర్యావరణ సమస్యలను, పోలవరం ప్రాజెక్టువల్ల ఉత్పన్నమయ్యే పర్యావరణ సమస్యలను, వాటి ద్వారా గిరిజనులకు జరిగే నష్టాలను గురించి సమర్థవంతంగా చిత్రించారు దిలావర్.

“ఆ ఏడు మండలాలు” కథలో తెలంగాణ వచ్చేముందు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్ లో విలీనం చేయడం గురించిన కథ.

ఆ తర్వాత రచయితకి ఖమ్మం జిల్లా వరరామచంద్రాపురం మండలంలోని మారుమూల కోయగూడెంలో టీచర్ గా ఉద్యోగం వస్తుంది. ఎవరైనా డాక్టర్లు, టీచర్లు, రెవెన్యూ సిబ్బందిగా ఏజెన్సీలో ఉద్యోగాలొస్తే చాలా భయపడతారు. రచయిత పుట్టి పెరిగింది ఆ ప్రాంతం కావడంలో రచయితకి కన్న తల్లి ఒడికి చేరుకున్నట్టు అనిపిస్తుంది. ఉన్న ఊరు, కన్న తల్లీ ఒకటేనంటారు.

రచయితకి ఉద్యోగం వచ్చాక జాయినింగ్ కోసం అడవి మార్గంలో ప్రయాణించి, తన స్కూల్ కి చేరుకోవాలి. అలా ప్రయాణించే సమయంలో రచయిత అడవిని ఎంతో మనోహరంగా వర్ణించారు. “నిప్పుగుండంలో తుకతుక ఉడికిపోతున్న మనిషిని ఒక్కసారిగా హిమాలయాల్లో నుంచో బెట్టినట్టుంది. చల్లని పిల్ల తెమ్మెర ఇన్నాళ్ళూ ఏమైపోయావు? అంటూ నా చెంపల్ని సుతారంగా నిమిరింది. ఒక విధమైన మత్తుతోకై ఎక్కిస్తున్న అడవిపూల సువాసనలు నన్ను సుడి వేశాయి. చిరపరిచితమైన చెట్టూ, చేమా, కొండాకోన, వాగూ వంకా నన్ను చూసి ఉత్సాహంతో కేరింతలు కొట్టుతున్నాయి. ఆకాశం, నేలా, మబ్బులూ, కొండలూ, తమనేస్తం వస్తున్నందుకేమో కళ్ళింతలు చేసుకొని చూస్తున్నాయి.”

ఇంతకాలం పట్టణాల్లో చదివిన రచయిత. అక్కడ కాలుష్యం వలన వాతావరణం ఎంతో వేడిగా ఉంటుంది. కాలుష్యం లేని ప్రాంతం కేవలం అడవులు మాత్రమే. అక్కడ ఎంతో ఆహ్లాదంగా, హాయిగా ఉంటుంది. ప్రకృతిలో తనకున్న బంధాన్ని చెప్పడం కోసం చల్లని పిల్ల తెమ్మెర ఇన్నాళ్ళు ఏమైపోయావని తన చెంపల్ని ఓ స్నేహితునిలా తాకినట్లు వర్ణించారు. ఇందులో రచయిత ప్రకృతిని ఎంతలా ప్రేమిస్తున్నాడో, ఎంతలా ఆరాధిస్తున్నాడో చెప్పారు. దానిలో లీనమైపోతే తప్ప ఇలాంటి వర్ణనలు చేయడం కష్టం. ఆ అడవి అందాలలో తను ఓ పక్షిలాగనో, జంతువులాగనో, లేదా పచ్చని చెట్టులాగనో మారి అక్కడి వాతావరణాన్ని అనుభవించి మరీ చెప్పాడు రచయిత.

అడవి బిడ్డల గోసలను ఎవరూ వినే పరిస్థితిలో లేరు. ఎవరి బిజీలో వారున్నారు. కానీ వారు చేసేది ప్రజాసేవనే కానీ అడవి ప్రజల బాధలు మాకుపట్టవు అన్నట్టు ఉంటుంది వారి ప్రవర్తన.

ప్రాజెక్టు కారణంగా ఎక్కువ భాగం అటవీ ప్రాంతం గిరిజన ఆవాసాలు ముంపుకు గురి కాబోతున్నాయి. అయితే పోలవరంలో అవినీతి అక్రమాలు, అణగారిన వర్గాల హక్కుల నిరాకరణపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం, పోలవరం కారణంగా నిర్వాసితులైతున్న ఆదివాసీలకు హక్కులు నిరాకరించబడుతున్నవి. రాజ్యాంగం ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతంలోని ఆదివాసీ ప్రాంత చట్టాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనేతరుల నుండి ఆదివాసులకు రక్షణ కల్పించడంలో విఫలమవుతుంది. అభివృద్ధి అంటేనే ఆదివాసులు, అణగారిన వర్గాల అణచివేతకు నిదర్శంగా పరిగణించబడుతుంది.

దిలావర్ అడవుల్లో జీవించే కోయలు, కొండరెడ్లు తదితర జీవితాలను, సమస్యలను చూసి చలించి పాఠకులకు తెలియచేసేందుకు రాసిన పన్నెండు కథాలసంపుటి *కొండా....కోనల్లో.* పోలవరం ప్రాజెక్టు కారణంగా ఏడు మండలాలను ఆంధ్రలో కలిపేస్తారు. ఈ సమస్యల నేపథ్యంలో ఆ మండలాల గిరిజనుల రోదన నిజంగానే అరణ్య రోదన అవుతుంది. కథారచయిత గిరిజనులను చైతన్యం చేసే ప్రయత్నం చేశారు. అలాగే వారి సమస్యలను సమాజానికి చేరవేశారు. గిరిజన సమస్యలను బహిర్గతం చేయడంలో భాగంగా వారి సంస్కృతితో మమేకమై రచయిత తను ఒక ముస్లిం అని కూడా మార్చిపోయి రచన చేశారు.

కథలన్నీ సులభశైలిలో ఉన్నాయి. కథల్లో సాధారణంగా కనిపించే ట్విస్టులు, సస్పెన్సులూ లేవు. సమస్యలను చిత్రించడమే అంతిమ లక్ష్యంగా కథలు సాగాయి. ఈ కథలన్నీ గిరిజనుల పక్షంగా సాగాయి. దానికి నిదర్శనం, ఆయన కథా కథనంలో భాగంగా వాడిన గిరిజన భాషాపదాలు సాంస్కృతిక విశేషాలు కన్పిస్తాయి. గిరిజన సమస్యలను బహిర్గతం చేయడంలో భాగంగా వారి సంస్కృతితో మమేకమై రచించారు. ఇవ్వన్నీ పూర్తిగా ఆదివాసీల జీవన చిత్రణను, జీవితంలో ఎదురైన సమస్యలను, చివరకు వారి జీవితాలు ఎలా మారాయి ఈ కథల్లో చిత్రించారు రచయిత.

**ఆధార గ్రంథాలు:**

1. దిలావర్. 2014. కొండ... కోనల్లో కథా సంపుటం. పాల్వంచ: సమతా ప్రచురణలు.